Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | ఆదివారం మే 18 2025 | సంపుటి:2 సంచి 230 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

# ఆడబిడ్డలతోనే ఆర్థిక క్రమశిక్షణ




## అభివృద్ధి సంక్షేమ పథకాల్లో వారికే పెద్దపీట

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి తీరుతాం
- ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది"
- వీ హబ్ విమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**తెలంగాణవీణ, హైదరాబాద్**

"ఆర్థిక క్రమశిక్షణ మా ఆడబిడ్డల సొంతం. సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో వారికే పెద్దపీట వేస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి తీరుతాం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో వీ హబ్ విమెన్ యాక్సిలరేషన్

-మిగతా 2 లో






# త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- మెట్రో ఛార్జీల పెంపును పరిశీలిస్తాం
- హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్షించిన మంత్రి పొన్నం

**తెలంగాణవీణ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు త్వరలో పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అలాగే, మెట్రో టికెట్ ధరల పెంపుపై కూడా తన దృష్టికి వచ్చిందని అన్నారు. వయబుల్ కాని కారణంగా మెట్రో ఛార్జీలు పెంచినట్లుగా వారు చెబుతున్నారు.. దానిపై ప్రభుత్వం సమీక్ష చేస్తుంది.. హైదరాబాద్ ఇంఛార్జ్

-మిగతా 2 లో



# భారత్ దాడులతో తీవ్రంగానే నష్టపోయాం

- ఎట్టకేలకు అంగీకరించిన పాక్

**తెలంగాణవీణ, ఇస్లామాబాద్,**

భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇన్ని రోజులు బుకాయించిన పాక్.. భారత్ దాడులు చేసిందని ఒప్పుకుంది. శుక్రవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ ప్రధాని షరీఫ్ ప్రసంగిస్తూ.. నూర్ ఖాన్‌తోపాటు– పలు వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని అంగీకరించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారత్ ఖచ్చితమైన దాడులు జరిపినట్లు

-మిగతా 2 లో




# డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ అగ్రస్థానం

## ఎక్స్ వేదికగా పోలీసులకు సీఎం రేవత్ అభినందనలు

**తెలంగాణవీణ, హైదరాబాద్,**

డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

-మిగతా 2 లో

# తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు

- కరీంనగర్ వేదికగా కేసీఆర్ ఉద్యమ పిలుపు
- అదో చారిత్రక సన్నివేశమన్న కేటీఆర్

**తెలంగాణవీణ, హైదరాబాద్,**

దశాబ్దాలపాటు– తేగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేసిన తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కరీంనగర్ వేదికగా ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భమది అని పేర్కొన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనప్రవాహం.. ఓ సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశమది. తెలంగాణ

-మిగతా 2 లో



ఏకాదశ దినకర్మ



జననం: 12-02-1947

మరణం: 08-05-2025

కీ॥శే॥ బండారి రాజిరెడ్డి గారు

మాజీ MLA ఉప్పల్, మాజీ TTD బోర్డ్ మెంబర్

మంచితనానికి మారుపేరుగా నిలిచి అందరి హృదయాలలో ప్రేమానురాగాలు నింపి, ఎల్లవేళలా మా సుఖాన్ని కోరుకున్న మీరు దైవసన్నిధికి చేరినారు. మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పటికీ చిరస్థాయిగా ఉంటాయి. మీ అకాల మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: బండారి వరమ్మ,

అమ్మ - నాన్న: కీ॥శే॥ బండారి జంగారెడ్డి - కీ॥శే॥ బండారి లక్ష్మమ్మ

కుమారులు - కోడళ్ళు: బండారి జగదీశ్వర్‌రెడ్డి - రజిత
బండారి జగన్‌మోహన్‌రెడ్డి - కీర్తి

కూతుళ్ళు - అల్లుళ్ళు: జక్కుల వసంత - ఐలారెడ్డి
CH. వనిత రాణి - కీ॥శే॥ వెంకట్ నర్సింహారెడ్డి

మనుమళ్ళు: తరుణ్‌రెడ్డి, తనయ్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, నిశిత్‌రెడ్డి, అర్యన్‌రెడ్డి,

మనుమరాళ్ళు: మాన్య, సాష

తమ్ముళ్ళు: బండారి నర్సింహారెడ్డి, కీ॥శే॥ బండారి బుచ్చిరెడ్డి, బండారి నీలంరెడ్డి, బండారి వెంకట్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి MLA, ఉప్పల్

చెల్లెళ్ళు - బావలు: M. భారతి - కీ॥శే॥ M. బాల్‌రెడ్డి,
S. సుశీల - S. లక్ష్మారెడ్డి, S. అనురాధ - S. లక్ష్మీనారాయణరెడ్డి

కార్యస్థలం: తేది: 18–05–2025, ఆదివారం రోజున, మధ్యాహ్నం 12గం.లకు, బండారి వ్యవసాయ క్షేత్రం, చీర్యాల గ్రా॥, కీసర మం॥, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నందు ఏకాదశ దినకర్మ జరుపబడును.

SLMI INFRA PROJECTS PVT. LTD. Above ICICI BANK, Begumpet
ARYAN CONSTRUCTIONS, ECIL 'X' Roads, Kushaiguda

# పాక్ కుట్రలు చెప్పేద్దాం!



## విదేశాలకు వివరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం

- ఏడుగురు ఎంపిలతో ఏడు బృందాల ఏర్పాటు
- శశిథరూర్, కనిమోళి, సుప్రీయా సూలెలకు చోటు
- థరూర్ పేరను కావాలనే ఎంపిక చేసిన ప్రభుత్వం

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ,**

భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న

-మిగతా 2 లో

# త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

(మొదటి తరువాయి)

మంత్రిగా తాను కూడా ఛార్జీలు తగ్గించమని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేస్తాను అని వెల్లడించారు. నగర అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ సమీక్ష సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి పనులపై చర్చించాం అని తెలిపారు. ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాను.. వర్షాకాలంలో వచ్చే సమస్యలను తగ్గించేలా క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.. ఇక, నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం.. స్ట్రీట్ లైట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం.. అలాగే, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇంటిని ఆక్యూపై చేసుకొని వారి విషయంలో ఏం చేయాలనే అంశంలో ఆలోచిస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో కొత్త టెక్నాలజీ అనుసంధానం చేస్తూ కోటి రేషన్ కార్డులన్నింటిని ఎటిఎం తరహా స్మార్ట్(చిప్) కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పం మరింత జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. రేషన్ పక్రియను మరింత సులభతరం చేసే చర్యల్లో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై గత కొన్ని నెలలుగా ఎంతో కసరత్తు చేసింది. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న తీరుతెన్నులను పరిశీలించింది. దాంతో వాటి కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే మెరుగైన పరిస్థితులు ఉన్నాయన్న అభిప్రాయానికి వచ్చారు. దాంతో పటిష్టమైన నిబంధనలతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పక్రియకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల తయారీ ఏజెన్సీల ఖరారుకు ప్రభుత్వం -టెండర్లను పిలిచింది. పౌరసరఫరాల శాఖ ఇచ్చిన టెండర్ లో స్మార్ట్ కార్డు క్వాలిటీ నిబంధనలు నిర్దేశిరచారు. అంతే కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణకు వీలుగా -టె-ండర్‌లో పాల్గొనే సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన కార్యాలయం లేదా బ్రాంచ్ ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. గతంలో అనుభవాలను దృష్టిలో పెట్టు-కుని ఏదైన న్యాయపరమైన వివాదాలకు తలెత్తినప్పుడు సదరు ఏజెన్సీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పష్టంగా ఆ నిబంధనను పెట్టింది. రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ కార్డులు 90.42 లక్షలు ఉన్నాయి. వీటి ద్వారా 285.98 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఇంకా అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉండడంతో పేదలు కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విధంగా ప్రజా పాలన కార్యక్రమంలో, మీ సేవ కేంద్రాల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ సంఖ్యలో ధరఖాస్తులు అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15లక్షల మేరకు కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన పేదలు ధరఖాస్తులు చేసుకున్నారు. వారంతా ప్రజాపాలన గ్రామసభలలో, మీ సేవ కేంద్రాల్లో ధరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో 19,34,464 ధరఖాస్తులు అందాయి. వాటిలో 1,97.450 ధరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇంకా 17,37,014 ధరఖాస్తులను పరిశీలన దశలో ఉన్నాయి. రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాల్లో 12,56,719 ధరఖాస్తులు రేషన్ కార్డుల కోసం వచ్చాయి. వాటిల్లో 7,71,053 ధరఖాస్తులను పరిశీలించారు. ఇంకా 4,85,666 ధరఖాస్తులను పరిశీలన దశలో ఉన్నాయి.

## భారత్ దాడులతో
# తీవ్రంగానే నష్టపోయాం

(మొదటి తరువాయి)

ధృవీకరించారు. భారత ఆపరేషన్ ప్రారంభమైన కొన్ని క్షణాల తర్వాత, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తనను తెల్లవారుజామున 2.30 గంటలకు నిద్రలేపారని షరీఫ్ అన్నారు. జనరల్ మునీర్.. నాకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి దాడుల గురించి తెలియజేశారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే క్షణం. ఆ సమయంలో మా వైమానిక దళం స్థానిక సాంకేతిక పరిజ్ఞానం, చైనీస్ యుద్ధ విమానాలను వినియోగించిందని షరీఫ్ చెప్పారు. కాగా, బిజెపి జాతీయ ఐటీ- విభాగం చీఫ్ అమిత్ మాల్వియా.. పాక్ ప్రధాని మాట్లాడిన వీడియో ఎక్స్ లో పోస్ట్ చేస్తూ.. ఇది ఆపరేషన్ సిందూర్.. ధైర్యం, సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. సిందూర్‌తో ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' తో పాక్ పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోన్న పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. తమ కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానికి దాడులు జరిపిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మీడియా సాక్షిగా ఒప్పుకున్నారు. మే 10 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారతదేశం జరిపిన ఖచ్చితమైన దాడులను ధ్రువీకరించారు.

# పాక్ కుట్రలు చెప్పేద్దాం

(మొదటి తరువాయి)

దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝూ(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు, పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక వివరణ ఇచ్చింది. ఆ ప్రతినిధుల బృందాలకు ఏడుగురు ఎంపీలు నాయకత్వం వహిస్తుండగా.. వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కూడా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పంపిన జాబితాలో అసలు థరూర్ పేరు లేకపోవడం గమనార్హం. పాక్‌ను ఎండగట్టేందుకు పంపే బృందం కోసం పేర్లు పంపాలని

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మే 16న కాంగ్రెస్‌ను కోరగా, అదేరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాలుగు పేర్లు పంపారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సయ్యద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్, మరో నేత గౌరవ్ గొగొయ్ ఉన్నారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ జాబితాలో థరూర్ పేరు లేదు. అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లేవీ లేవు. కానీ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు మాత్రం అనూహ్యంగా చోటు- దక్కింది. ఇటీవలి పరిణామాలపై దేశం విధానాన్ని వివిధ దేశాలకు వివరించేందుకు వెళ్తున్న బృందానికి నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రయోజనాలతో ముడిపడిన సందర్భాల్లో అక్కడ నా అవసరం ఉంటే.. నేను అందుబాటులో ఉంటా. జైహింద్ అని థరూర్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# ఆడబిడ్డలతోనే ఆర్థిక క్రమశిక్షణ

(మొదటి తరువాయి)

కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రంగాల్లో వారికి ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. "మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఫలితంగా ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆడబిడ్డలకు అప్పగించాం. విద్యార్థుల యూనిఫాంల కుట్టుపనిని మహిళా సంఘాలకు అప్పగించి వారికి భరోసా అందించాం. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహిస్తున్నాం పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాలు చేసేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం అదానీ, అంబానీలకు పరిమితమైన వ్యాపారాలను మహిళలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. శిల్పారామంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు స్టాళ్లను కేటాయించాం" అని సీఎం అన్నారు. ఇప్పటికే వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని మహిళలకు అప్పగించామనీ, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తే మరో వెయ్యి మెగావాట్ల వ్యాపారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వాటినే రాష్ట్రానికి వచ్చే అతిథులకు బహుమ తులుగా అందిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డలను ప్రోత్సహించడమే ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. రూ.16 లక్షల కోట్లను కార్పొరేట్ కంపెనీలకు అప్పు ఇస్తే ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్లారనీ, కానీ ఆడబిడ్డలకు అప్పు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగ్గొట్టకుండా వడ్డీతో సహా చెల్లిస్తున్నారని కొనియా డారు. అదే స్ఫూర్తితో మహిళా సంఘాలు ముందు కెళ్లాలని ఆకాంక్షించారు. చైనా, పాకిస్తాన్లతో యుద్ధం జరిగినపుడు ఇందిరాగాంధీ మహిళా శక్తిని ప్రపంచా నికి చాటారని గుర్తు చేశారు. దేశాన్ని గెలిపించిన మహిళా శక్తిని కాంగ్రెస్ ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదని అన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం వారిని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలబెట్టేందుకు కృషి చేస్తోందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# అదిగో ఇదిగో

- -ఏడాదికాలంగా కాలయాపన
- -ఆశావహుల ఎదురుచూపులు
- -టీపీసీసీ కార్యవర్గంపై ఉత్కంఠ

తెలంగాణవీణ, హైదరాబాద్

ఇదిగో నూతన కార్యవర్గం వస్తోంది అదిగో నూతన కార్యవర్గం వస్తోంది ఇది ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఒక సంకట పరిస్థితి. గత ఏడాది కాలంగా ఇదే తంతు. ఇదే ప్రచారం. ఇప్పటికీ కార్యవర్గం ఎప్పుడొస్తోందో తెలియక క్యాడర్ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నది. ఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని నియమించడంలో ఆలస్యం చేస్తోంది. పదవులను ఆశిస్తున్న నాయకులెంతో మంది పార్టీ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. అయినప్పటికీ అధిష్టానం అదిగో, ఇదిగో అంటూ కాలం వెల్లబుచ్చుతున్నది. ఏ రాజకీయ పార్టీకైనా కార్యవర్గం ఎంతో కీలకమైంది. సీనియర్లతోపాటు కొత్త నాయకత్వం కార్యవర్గంలోకి రావడంతో ఆ పార్టీ ఉత్సాహంగా ముందుకు పోతుంది. కానీ మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఏడాది గడిచినా ఇంకా కార్యవర్గం కార్యరూపం దాల్చలేదు. దీంతో పార్టీ క్యాడర్ ఆవేదనలో ఉన్నది. ప్రతిసారి నాయకులు ఢిల్లీకి పోవడం, రావడమే తప్ప కొత్త కార్యవర్గాన్ని తీసుకు రాలేకపోతున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది. కార్యవర్గంలోకి తమ అనుచరులను తీసుకోవాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర అధ్యక్షుడిపై తీవ్రంగా ఒత్తిడి పెంచుతున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మంత్రులు కూడా పెద్ద జాబితానే ఇచ్చినట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తమకు తెలిసిన అధిష్టానం పెద్దల ద్వారా తమ అనుయాయులకు ఇవ్వాలని పైరవీ చేస్తున్నారు. అంతేకాకుండా ఏ మంత్రి సిఫారసు చేసినా%ొ%ఆ పేరుపై మరొక మంత్రి అభ్యంతరం చెబుతున్నారు. దీంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు పదవులు ఇవ్వాలనే ఉద్దేశంతో అధిష్టానం ఉన్నది. ముఖ్యంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా అధిష్టానం నిర్ణయాన్ని అమలు చేయాలనే తలంపుతో ఉన్నట్టు తెలిసింది. మీనాక్షి నటరాజన్ పెట్టుకున్న లక్ష్యాన్ని ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాము పార్టీని నమ్ముకుని కాంగ్రెస్ కండువా కప్పుకున్నామనీ, తమకు పదవులు ఇవ్వకుంటే ఎలా అంటూ అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ల కమిటీ చైర్మెన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మెన్లు, సహకార బ్యాంకులు డైరెక్టర్లు% తఇలా ఎన్నో ప్రభుత్వ పదవులు ఇవ్వాల్సి ఉన్నది. ఈ పదవులతోపాటు నూతన కార్యవర్గంలోకి తీసుకునే నాయకులను గుర్తించడం కూడా పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. పదేండ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో నేతల్లో పదవులపై ఆశలు కూడా పెరిగాయి. ఈనేపథ్యంలో ఎవరికి పార్టీ పదవిని ఇవ్వాలో, ఏ నాయకుడికి ప్రభుత్వ పదవి ఇవ్వాలో తేల్చలేక అధిష్టానం తలమునకలవుతోందని సమాచారం.

# తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు

(మొదటి తరువాయి)




వచ్చేదా సచ్చేదా అని ఎంతో మంది అడుగడుగునా అవమానించినా, రకరకాలుగా అవహేళన చేసినా వెన్నుచూపని ఆ ధీరోదాత్తుడి సంకల్పం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఓ చెరగని సంతకం. ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం అనుకున్న గమ్యాన్ని ముద్దాడటమే ఒక చారిత్రక విజయమైతే.. ఇక ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై, సాధించిన తెలంగాణను పదేళ్లలోనే దేశానికే దారిచూపి దీపస్తంభంలా తీర్చిదిద్దిన ఆ దార్శనికత.. ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణం అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అని కేటీఆర్ వివరించారు.

తెలంగాణవీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



# అడవిదొంగలపై కఠిన చర్యలేవీ?

తెలంగాణవీణ, ఆదిలాబాద్,

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రతి రోజు లక్షలాది రూపాయల విలువ చేసే టేకు కలప అక్రమంగా తరలిపోతుంది. ఆదిలాబాద్ టేకు కలపకు ఇతర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. కోట్లాది రూపాయల కలప అ క్రమంగా తరలిపోతుంటే లక్షలాది రూ పాయల అక్రమ కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. కవ్వాల్ అభయారణ్యంతోపాటు జిల్లాలోని ఇతర అటవీ ప్రాంతాల నుంచి టేకుతోపాటు ఇసుక, రాయి, మొరం అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం అంతా కింది స్థాయి నుంచి ఉన్నతాధి కారుల వరకు తెలిసినప్పటికీ మామూళ్లు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అటవీశాఖ చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అడవుల నుంచి అక్రమ కలప, ఇసుక, రాయి, వన్యప్రాణుల మాంసాన్ని తరలించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని ఆ వాహనాల నుంచి డబ్బులు తీసుకుని వదిలి పెట్టడంతోపాటు ఇతర వాహనాల నుంచి కూడా ఎంతో కొంత ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జింక, దుప్పులు, అడవి పంది తదితర వన్యప్రాణులను వేటగాళ్లు హతమార్చి



మాంసాన్ని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు ఎవరూ, వారు ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే విషయాలు అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలోని 2 వందల ఎకరాల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే టేకు వృక్షాలను గిరిజనులు పోడు వ్యవసాయం పేరిట నరికివేశారు. వందలాది ఎకరాల్లోని వేలాది టేకు వృక్షాలను నరికి అక్రమంగా కలపను ఇతర ప్రాంతాలకు ఇప్పటికే తరలించుకుపోయారు. అటవీ సంపద నాశనం కావడానికి కారకులైన ఆ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే స్మగ్లర్లు అడవులను పూర్తిగా ధ్వంసం చేశారు. వన్యప్రాణుల ను ఇష్టం వచ్చినట్లుగా వేటాడారు. ఆదిలాబాద్ జిల్లా అంటే దట్టమైన దండకారణ్యంతో ఒకప్పుడు అడవుల జిల్లాగా పేరు ఉండేది. ఆకాశాన్ని ముద్దాడే టేకు వృక్షాలతో కనుచూపు మేర పచ్చని చెట్లతో, పక్షుల కిలకిలరావాల, చెంగుచెంగున ఎగిరే జింకలతో అహ్లాదకరంగా ఉండేది. స్మగ్లర్ల, వేటగాళ్ల ధనదాహానికి అటవీశాఖ అధికారుల అవినీతి, అక్రమాలు తోడవడంతో అడవి తల్లి నేలకొరగగా, వన్యప్రాణులు అంతరించిపోయే దుర్భర పరిస్థితి దాపురించింది. రిజర్వు ఫారెస్టులో చెరువుల నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ పెంబి రిజర్వు ఫారెస్టులో చెరువులను నిర్మించారు. జిల్లా విస్తీర్ణంలో ఒకప్పుడు 40 శాతం ఉన్న అడవి ఇప్పుడు చాల తక్కువ శాతంలో ఉంది. అడవిని, కవ్వాల్ అభయారణ్యం నుంచి చిన్న కర్ర కూడా బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. టి అక్రమాలకు పాల్పడ్డా కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.

# సీఎంతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ

-త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు
-బోర్డులో భాగస్వామి కావాలని రేవంత్ అభ్యర్థన

తెలంగాణవీణ, హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు- చెప్పారు. ఈ బోర్డులో భాగస్వామ్యం కావాలని అభిజిత్ బెనర్జీని కోరగా.. అందుకు ఆయన అంగీకరించారు. ఫ్యూచర్ సిటీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని సలహా ఇచ్చారు. ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై



కాసేపు ముచ్చటించారు. శనివారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టించడంతో పాటు తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్ ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆయనకు వివరించారు. తెలంగాణకు సంబంధించిన విశిష్టతను, ఇక్కడున్న అనుకూలతలను ప్రపంచమంతటా చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతుల సాధికారత, యువతకు ఉద్యోగాలతో పాటు స్కిల్ డెవెలప్మెంట్ దిశగా ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు- చేయనున్న తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో భాగస్వామ్యం పంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అభిజిత్ బెనర్జీని ఆహ్వానించారు. భవిష్యత్తు విజన్ రూపకల్పనలో ఇతర ప్రముఖులతో పాటు- తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు. గొప్ప విజన్ తో ముందుకు సాగుతున్నారని అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసించారు

# మానవాళికి పాకిస్థాన్ ప్రమాదకరంగా మారింది

-ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ




తెలంగాణవీణ, హైదరాబాద్

పాకిస్థాన్ ఎన్నో ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని, ఆ దేశం మానవాళికి ప్రమాదకరంగా మారినట్లు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఇటీవల జరిగిన పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో.. పాకిస్థాన్ చర్యల గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆల్ పార్టీ బృందాన్ని పంపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాన్ని పేర్కొన్నారు.పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఎలా అమాయకుల్ని చంపుతున్నారన్న విషయాన్ని ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పాక్ ఉగ్రవాదానికి భారత్ బాధిత దేశంగా నిలిచిందని, ఇప్పటి వరకు తమాషా చూశామని, జియా ఉల్ హక్ కాలం నుంచి ప్రజల్ని చంపేశారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే దౌత్యపరమైన అంశాలను తనకు ఇంకా వెల్లడించలేదన్నారు. ఇస్లామిక్ దేశమని చెప్పుకుంటున్న పాకిస్థాన్ తన చర్యల్ని మానుకోవాలన్నారు. భారత్‌లో సుమారు 20 కోట్ల మంది ముస్లింలు జీవిస్తున్నారని, ఈ విషయాన్ని కూడా ప్రపంచ దేశాలకు తెలియజేయాలన్నారు. ఇండియాను దెబ్బతీసి, మతఘర్షణలు రాజేసి, దేశ ఆర్థిక వృద్ధిని అడ్డుకోవాలని పాకిస్థాన్ భావిస్తున్నట్లు ఓవైసీ తెలిపారు. వాళ్లు తమాషా చేస్తున్నారని, వాళ్లు ఇలాంటి పనులు ఆపబోరని, కానీ పెహల్గామ్ దాడితో భారత్ తన సహనం కోల్పోయిందని ఓవైసీ అన్నారు. ఉగ్రవాదులకు ఆయుధాలు ఇవ్వడం, శిక్షణ ఇవ్వడం, ఫైనాన్సింగ్ ద్వారా పాకిస్థాన్ మానవాళికి ప్రమాదంగా మారినట్లు ఓవైసీ తెలిపారు.

# పాక్‌ను ఉగ్రజాబితాలో చేర్చాలి


ఐక్యరాజ్యసమితిలో తీర్మానానికి పట్టుబట్టాలి
రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ సూచన

తెలంగాణవీణ, న్యూఢిల్లీ,



పాకిస్థాన్‌ను ఉగ్రవాదదేశంగా ప్రకటిస్తూ..చట్టవిరుద్ధ కార్యకలాపాల చట్టంలో సవరణ చేయాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఉగ్రవాద నిర్మూలన భారత్- పాక్‌కే కాకుండా..ప్రపంచ దేశాల పురోగతికి ఉపయోగపడుతుందని సిబల్ అన్నారు. భారత్‌కు అతిపెద్ద సమస్య ఉగ్రవాదం కాబట్టి దానిని పూర్తిగా పెకలించివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో సవరణ తీసుకువచ్చి..పాక్‌ను ఉగ్రవాద దేశంగా జాబితా చేస్తూ షెడ్యూల్‌ను జోడించాలని సూచించారు. కశ్మీర్ ప్రజలు నిశ్చింతగా ఉండాలంటే భారత విదేశాంగ శాఖ ఈ చర్యలు తీసుకోవాల్సి ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రపంచ వేదికలపైకి వెళ్లినప్పుడు ఉగ్రవాద సమస్యపై వాటితో చర్చించాలని..ఉగ్రసంస్థలకు ప్రపంచ దేశాల నుంచి నిధులు అందకుండా అడ్డుకోవాలని సూచించారు. పాక్ ఉగ్రకుట్రలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టడానికి భారత్ నుంచి అఖిలపక్ష ప్రతినిధుల బృందాలను ప్రపంచ దేశాలకు పంపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిబల్ స్వాగతించారు. ప్రతిపక్షాలతో సమావేశంలో వారు ఇచ్చిన సూచనలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని అన్నారు. ఈ విధంగా దేశంలోని అన్ని పార్టీలు ఉగ్రవాద నిర్మూలనకు ఏకమైనప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన అనంతరం భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అయినప్పటికీ పాక్ ఉగ్రవాదులను

# భారత్-పాకిస్థాన్ దేశాలు మళ్లీ శాంతి చర్చలు జరుపాలి



తెలంగాణవీణ, న్యూఢిల్లీ,

భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఆ రెండు దేశాలు పరస్పర చర్చలు జరుపాలని ఇప్పటికే అమెరికా , చైనా భారత్‌కు సూచించాయి. తాజాగా రష్యా కూడా ఆ జాబితాలో చేరింది. 'ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలపై భారత్, పాకిస్థాన్ ప్రత్యక్ష శాంతి ఒప్పంద చర్చలు జరపాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం' అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు.ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందిస్తూ.. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. రెండు దేశాల మధ్య సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. రెండు దేశాలు శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా.. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఇదిలావుంటే భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పేర్కొంది.

# విమానంలో దొంగతనం..


చైనా జాతీయుడు అరెస్ట్



తెలంగాణవీణ, న్యూఢిల్లీ

విమానం గాలిలో ఉండగా దొంగతనం జరిగింది. తమ డెబిట్, క్రెడిట్ కారులు చోరీ అయ్యాయని పలువురు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. చైనా జాతీయుడు కూర్చొన్న సీటు కింద ఒక క్రెడిట్ కార్డును విమాన సిబ్బంది గుర్తించారు. చైనా వ్యక్తులు ప్రయాణికుల బ్యాగులను ఓపెన్ చేయడాన్ని ఒకరు రికార్డ్ చేశారు. మే 14న హాంకాంగ్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన ఎయిర్ ఇండియా విమానంలో ఈ సంఘటన జరిగింది.కాగా, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ కాగానే చైనా జాతీయుడైన 30 ఏళ్ల బెన్లె పాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ విమానంలో ప్రయాణించిన మరో ముగ్గురు చైనా జాతీయులను కూడా అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వారి మొబైల్ ఫోన్లు, పర్సులు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ పరీక్ష కోసం వాటిని పంపారు. మరోవైపు దూర ప్రయాణ విమానాల్లో చోరీలకు పాల్పడే గ్లోబల్ సిండికేట్ ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి విమాన చోరీలతో వారికి ప్రమేయం ఉన్నదా అన్నది ఆరా తీస్తున్నారు. అంతర్జాతీయ సమన్వయంతో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# గాజాపై భీకర దాడులు 146 మంది మృతి




తెలంగాణవీణ, గాజా

గాజాపై ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడిలో 146 మంది పౌరులు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. గత 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ వైమానిక దళం కురిపించిన బాంబుల వర్షంలో తీవ్ర ప్రాణనష్టం సంభవించినట్టు గాజా ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. గత 24 గంటల్లో జరిగిన దాడుల్లో 459 మంది పౌరులు గాయపడ్డారని పేర్కొన్నది. విస్తృతమైన దాడులు, దళాల సమీకరణ నిర్వహిస్తున్నట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

సంపాదకీయం

# పాక్ ఆక్రమి కాశ్మీర్ పోరు చేపట్టాలి !

కాశ్మీర్ లేకుంటే పాక్ బతుక జాలదు. రాజకీయాల్లో రాణించాలంటే కాశ్మీర్ అంశం కావాలి. కాశ్మీర్ అంశం లేకుంటే మిలిటరీని పట్టించుకోరు. కాశ్మీర్ లేకుంటే ఉగ్రవాదులు మనజాలరు. ఇన్నిరకాలుగా కాశ్మీర్‌తో పాక్ రాజకీయాలు ముడిపడి ఉన్నాయి. దీనంతటికీ విభజన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం, కాశ్మీర్ విషయంలో నెహ్రూ అనుసరించిన మెతకవైఖరి కూడా కారణం. ఆ తరవాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ దీనిని కొనసాగించడం వల్ల కూడా కాశ్మీర్ రావణ కాష్టంలా మారింది. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్దికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాక్‌కు మాటల తో సమాధానం చెప్పలేమని గతానుభవాలను బట్టి తెలుసుకోవాలి. పాక్‌లో అంతర్గ సంక్షోభాలు వచ్చిన ప్పుడల్లా ఇలా భార్‌తపైకి దాడులకు దిగుతారు. పాకిస్తాన్ ప్రజలను రెచ్చ గొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు. కాశ్మీర్‌లో జరుగుతన్న హింసాకాండ వెనక పాక్ ప్రోద్బలం నిరంతరాయంగా సాగడానికి కాంగ్రెస్ పాలకులు దోహదపడ్డారు. అందుకే 370 ఆర్టికల్ తరవాత కాశ్మీరీల్లో ఇప్పుడిప్పుడే ఆత్మస్థయిర్యం వచ్చింది. బతకాడానికి అవకాశాలు వచ్చాయి. ఇంతకాలం ఉగ్రవాదులకు భయపడి బతికే వారు. ఇప్పుడే అక్కడా స్వేచ్ఛా పవనాలు వీచాయి. ఈ క్రమంలో దీనిని తట్టుకోలేని పాక్పహల్గామ్ దాడితో మళ్లీ చిచ్చు రగిల్చే ప్రయత్నం చేసింది. అయితే దీనికి ప్రభుత్వం దీటైన జవాబివ్వడం ద్వారా గతంలో లాగా మీ ఆటలు సాగవని మోడీ ప్రభుత్వం తేల్చిచెప్పింది. 370 ఆర్టికల్ రద్దు తరవాత ప్రశాంతంగా ఉంటున్న కాశ్మీర్‌లో ఈ మధ్యకాలంలో మళ్లీ ఉగ్రవాదుల బరితెగింపు మొదల య్యింది. పాక్‌లో ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదనడానికి ఇది నిదర్శనం. అడపాదడపా హిందువులు లక్ష్యంగా ఉగ్రమూకలు కాల్పులకు తెగబడుతూ ..పహల్గాం ద్వారా రక్తపుటేరులు పారించారు. కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాను అడ్డం పెట్టుకుని అక్కడ రాచరికం అనుభవించిన అబ్దుల్లాలో, ముఫ్తీలు కూడా కాశ్మీర్‌లో తమ పెత్తనం కొనసాగేలా చూస్తుంటారు. కాశ్మీర్‌లో ఇప్పటికే 75శాతం పండిట్లను ఊచకోత కోసారు. ఉన్నవారు ఊరు విడిచి వెళ్లిపోయారు. దేశంలో ఎక్కడో ఓ చోట తలదాచుకుంటున్నారు. అయినా వారికి న్యాయం చేయాలన్న జ్ఞానం ఈ నేతలకు లేదు. కాశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం అత్యావశ్యకం. అక్కడి అమాయక ప్రజలు ఉగ్రమూకల కారణంగా జీవితాలు కోల్పోరాదు. వారు ఏ మతం వారైనా సామాన్యులే అన్న విషయం గుర్తించాలి. అందుకే ఇక కాశ్మీర్ విషయంలో తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా కఠినంగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతు న్నారు. తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ సమయంలో 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. పాక్‌ను దెబ్బ కొడుతూనే పివోకెను స్వాధీనం చేసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు కనుక ఏ మాత్రం తేడా వచ్చినా పాక్‌ను దెబ్బకొడుతూనే ఉండాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. జమ్మూ-కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ స్వరాన్ని పెంచి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా నినదించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇచ్చింది. ఉగ్రవాదం, పివోకెలే తమ అజెండా అని తేల్చింది. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు కనువిప్పు కలిగించాలి. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంత కాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ స్పష్టం చేయడంతో పాటు, పాక్ కుతంత్రాలను ప్రపంచానికి తెలియచేసారు. ఒకవేళ పాక్‌తో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పైనే ఉంటాయని తేల్చి చెప్పారు. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని ప్రపంచం యావత్తూ గుర్తించిన నేపథ్యంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎజెండాగా పనిచేయాలి. 370 రద్దు తర్వాత ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న వారి కలను సాకారం చేయాలి. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని ప్రార్థిద్దాం. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. పరిస్థితులు ఏమాత్రం చేయి దాటిపోకుండా భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాక్ తన ప్రేలాపనలు ఆపడం లేదు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కొన్నేళ్లుగా కేంద్రం తీసుకున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. మరోమారు కాశ్మీర్‌లో వేలుపెట్టకుండా పాక్‌కు గట్టి బుద్ధి చెప్పాలి. అలాగే కాశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేతను మరింత సవాల్‌గా తీసుకోవాలి. అక్కడ ఉగ్రవాదులు కాలుపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలి.

# నగరంలో పార్కుల సంఖ్య తగ్గుతుంది

### కబ్జాలు అక్రమ వసూళ్లపై సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం



**తెలంగాణవీణ, కరీంనగర్,**
నగరంలో పార్కుల కబ్జాలు, గ్రామ పంచాయతీ భూములపై పెరుగుతున్న అక్రమాలపై మాజీ మేయర్, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు.సంస్థాగత స్థాయిలో అవినీతి బహిర్గతం చేస్తూ, ఒక్కో క్లబ్‌కు మూడు కోట్ల వరకు వసూళ్లు చేయడం సిగ్గుచేటు అంటూ విమర్శలు గుప్పించారు. గతంలో 42 పార్కులు ఉన్న నగరంలో ఇప్పుడు కేవలం 35 పార్కులే మిగిలి ఉన్నాయన్న సర్దార్, పార్కుల స్థలాలను క్లబ్‌లుగా మార్చి భారీ స్థాయిలో దోచుకుంటున్నారని ఆరోపించారు. క్రీడా అభివృద్ధి పేరిట మున్సిపల్ స్థలాల్లో తాళాలు వేసిన తీరుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట నగర ప్రజల నుంచి వేల కోట్లు వసూలు చేయడం సిగ్గుచేటు. గతంలో వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలి. అవినీతిపరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ భూముల ఎఫ్ ఎల్ టి లిస్ట్ ఇప్పటికీ సిద్ధం కాకపోవడాన్ని తప్పుపడుతూ, అధికారులు కనీస బాధ్యత తీసుకోవడం లేదని మండిపడ్డారు.ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న కబ్జాలు, మార్కెట్ స్థలాల ఆక్రమణలు సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా త్రఇవయల్ గా తీసుకుంటున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం అని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ఉన్న మార్కెట్ ను పట్టించుకోకుండా మరో మార్కెట్ నిర్మించడం వెనుక ఉన్న దోపిడీ వ్యూహాన్ని భయపెడుతున్నాయన్నారు. శవాలపై కూడా రాజకీయాలు చేయడాన్ని ఖండిస్తూ,దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఒక్క రూపాయికే అంత్యక్రియల పథకాన్ని మేమే ప్రారంభించాం. దానిపై కూడా రాజకీయాల పరంపర కొనసాగడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. ఉద్యమకారుడిగా ఎన్నో అరెస్టులు ఎదుర్కొన్నా, బెదిరింపులకు భయపడకుండా ప్రజల సమస్యలపై పోరాడుతున్నా. ఇకనైనా జిల్లా కలెక్టర్, కమిషనర్‌లు స్పందించి చర్యలు తీసుకోవాలి. లేదంటే ఊరుకునేది లేదు అని హితవు పలికారు.

# మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి

### - మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్..



**తెలంగాణవీణ, కల్వకుర్తి,**
కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలోని బి(టి)ఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వారి స్వగృహం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ..నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రాంత బిడ్డగా,ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు.ఆయన మాట్లాడుతూ ఈనెల 19 న అచ్చంపేట మండలంలోని అమ్రాబాద్ మండలం తో పాటు తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో తెలియజేయాలి అని అన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్వకుర్తిని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని చెప్పి మాట తప్పారని,ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని,జన్మనిచ్చిన కల్వకుర్తి ప్రాంతానికి కొడంగల్ తో పాటు సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాలి అన్నారు.కొడంగల్ తో పాటు కల్వకుర్తి ప్రాంతానికి కూడా మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజీ లను మంజూరు చేయాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేసుకున్న పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు స్వర్గీయ జైపాల్ రెడ్డి పేరును పెట్టాలన్న అన్నారు. జన్మనిచ్చిన ప్రాంతానికి మీరిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మీ రాకతో ఏదైనా ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి,మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, కాటన్ మిల్ అధ్యక్షులు సూర్య ప్రకాష్,మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ గుప్తా, మండల అధ్యక్షుడు విజయ్ గౌడ,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షాహిద్,కల్వకుర్తి సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు జంగయ్య,బన్నీ శ్రీధర్ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర జవానులకు వందనాలు ...

### -19న జరిగే తిరంగా యాత్రను విజయవంతం చేయండి....
### -బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...




**తెలంగాణవీణ, కరీంనగర్,**
ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించిందని, ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ సోమవారం రోజున కరీంనగర్ లోని తెలంగాణచౌక్ చౌరస్తా నుండి టవర్ సర్కిల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొంటారని , ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.మే 19 సాయంత్రం 5 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవుతుందనీ, బిజెపి శ్రేణులు అందరూ ఈ ప్రోగ్రాం లో పాల్గొని కార్యక్రమాన్ని సక్సెస్ చేయడానికి తగిన కృషి చేయాలన్నారు.మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం విశ్వగురు స్థాయికి ఎదిగిందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ధైర్యం భారతదేశానికి ఉందనే విషయం ప్రపంచానికి మొత్తం అర్థమైందన్నారు.ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన చర్యలకు దేశ ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలిపారని, . 26 నిమిషాల్లో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత భారత సైన్యానికి దక్కుతుందన్నారు.పాకిస్థాన్ తుప్పు పట్టిన చైనా ఆయుధాలు, పనికిరాని టర్కీ డ్రోన్లతోఅల్లకల్లోలం సృష్టించాలనుకుందనీ, అయితే భారత సైన్యం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలతో అద్భుతమైన విజయం సాధించిందని తెలిపారు.చివరికి పాకిస్థాన్ అమెరికా ద్వారా శరణు వేడేలా భారత ప్రధానమంత్రి తో బ్రతిమిలాడుకునే స్థాయికి దిగజారిందన్నారు.భారత సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న క్షిపణి వ్యవస్థ, ఆయుధాలతో పాకిస్థాన్ కు ని ( ద ల ని కాలరాత్రులుగడిపేలాచేశారని,రానున్న కాలంలో పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు, దురాగతాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత ప్రధాని ధీటుగా బదులిచ్చారన్నారు.ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాడి అమరులైన వీర జవాన్లకు, వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వందనాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా , మండల, అసెంబ్లీ కేంద్రాల్లో తిరంగా యాత్ర కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని, భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# ఎంపీ వద్దిరాజు ఖమ్మంలో పరామర్శ....

**తెలంగాణవీణ, ఖమ్మం,**
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం రాత్రి ఖమ్మం గ్రెయిన్ మార్కెట్ సమీపాన ఉన్న బీఆర్ఎస్ నాయకుడు ఎర్రా అప్పారావు నివాసాన్ని సందర్శించారు. బీఆర్ఎస్ 29వ డివిజన్ అధ్యక్షుడు, వ్యాపారవేత్త ఎర్రా అప్పారావు సతీమణి కృష్ణవేణి ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ లో చికిత్స పొంది ఖమ్మంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి ఎంపీ రవిచంద్ర సన్నిహితులు ఆకుల గాంధీ, ఆకుతోట ఆదినారాయణ, చందు జనార్ధన్, తోట వీరభద్రం, జల్లెల శ్రీనివాసరావు తదితరులతో కలిసి వారి నివాసానికి వెళ్లారువారు కృష్ణవేణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకుని త్వరితగతిన



కోలుకోవాలని ఆకాంక్షించారు.

# లెగ్డా డిజైన్ స్టూడియో' రెండో బ్రాంచ్

# ఆవిష్కరించిన హీరోయిన్ అనన్య నాగళ్ల





**-వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్**


**తెలంగాణ వీణ/తార్నాక:**

మహిళల కలలకు రూపమిచ్చే డిజైన్స్‌తో, ఫ్యాషన్ ప్రపంచాన్ని కలర్‌ఫుల్‌గా మార్చుతున్న 'లెగ్డా డిజైన్ స్టూడియో' ఇప్పుడు మరింత విస్తృత రూపంలో ముందుకొస్తోంది. ఈ స్టూడియో రెండో బ్రాంచ్‌ను టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ అనన్య నాగళ్ల హబ్సిగూడలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవంలో ఫ్యాషన్ డిజైనర్ దివ్య కర్నాటి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు దర్గా దయాకర్, బీఆర్‌ఎస్ నాయకులు మంద సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ స్ట్రీట్ వాక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోడల్స్ ఫ్యాషన్ డిజైన్లను ఆహ్లాదకరంగా ప్రదర్శించి, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ నటి అనన్య నాగళ్ల మాట్లాడుతూ – "మహిళలు తమ కలల డిజైన్‌లు ధరించి స్వయం ప్రతిష్టను పొందడానికి లెగ్డా డిజైన్ స్టూడియో చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయమైనది. ప్రత్యేకించి మహిళలకు ఉపాధిని కల్పిస్తూ, వారి సృజనాత్మకతకు మద్దతుగా నిలుస్తున్న దివ్య కర్నాటి గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఈ బ్రాంచ్ ద్వారా మరెందరో మహిళలు తమ ఫ్యాషన్ కలలను నిజం చేసుకుంటారనే విశ్వాసం ఉంది" అని ఆమె అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. "అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో ఫ్యాషన్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎంతో మందికి ఉపాధి కల్పించేలా దివ్య కర్నాటి.. లెగ్డా డిజైన్ స్టూడియో ఏర్పాటు చేశారు. అన్ని వయసుల



వారికి, అన్ని రకాల వేడుకలకు అవసరమైన డిజైన్స్ ఇక్కడ దొరుకుతాయి. లెగ్డా డిజైన్ స్టూడియోకు వస్తే ఫ్యాషన్ అవసరాలన్నీ తీరుతాయి." అని అన్నారు. మాజీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. "మహిళా సాధికారత సాధిస్తేనే దేశం ముందుకు వెళుతుంది. ఆధునిక యువత మెచ్చే ఫ్యాషన్స్ అందించేందుకు దివ్య కర్నాటి తన స్వయంకృషితో 'లెగ్డా డిజైన్ స్టూడియో' ప్రారంభించడం అభినందనీయం. పేషెంట్‌ను పరిక్షించి డాక్టర్ మందులు ఇచ్చినట్టే, రూపురేఖలను బట్టి సదరు వ్యక్తికి సరైన ఫ్యాషన్ దుస్తులను రూపొందించే 'లెగ్డా డిజైన్ స్టూడియో' ప్రతి ఒక్కరి అవసరాలను తీర్చే విధంగా ఉంది." అని అన్నారు. 'లెగ్డా డిజైన్ స్టూడియో' నిర్వహకురాలు దివ్య కర్నాటి మాట్లాడుతూ – "ఈ తరం యువతకు, పిల్లలకు, వైవిధ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికీ సృజనాత్మకతను జత చేస్తూ 'లెగ్డా డిజైన్ స్టూడియో అందమైన ఆధునిక డిజైన్‌లు అందిస్తోంది. మా కస్టమర్‌ల నుంచి వస్తున్న అద్భుత స్పందన మాకు ఈ రెండవ బ్రాంచీకి శ్రీకారం చుట్టేలా చేసింది. మా రెండవ బ్రాంచీని ప్రారంభించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి మా హృదయపూర్వక ధన్యవాదాలు." అని అన్నారు. 2015లో కేవలం ఇద్దరు ఉద్యోగులతో ప్రారంభమైన ఈ స్టూడియోను దివ్య కర్నాటి స్థాపించారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో పట్టాభిషేకం పొందిన దివ్య కర్నాటి నేడు 30 మందికి పైగా నిపుణులతో కలిసి 'లెగ్డా'ను మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిపారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ లక్షలాది కస్టమర్ల విశ్వాసాన్ని పొందిన ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నారు. దివ్య కర్నాటి ఇండియన్ కిడ్స్ ఫ్యాషన్ వీక్ లో 30 మంది పిల్లల డ్రెస్ డిజైన్ చేసినందుకు బెస్ట్ ఫ్యాషన్ డిజైనర్ అవార్డు, మరో సంస్థ ద్వారా నంది అవార్డు అందుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఈ కొత్త బ్రాంచ్‌లో కేవలం డ్రెస్‌లు మాత్రమే కాకుండా, మహిళలు, పురుషులు, పిల్లలందరికీ అనుగుణంగా మ్యాచింగ్ అయ్యే వన్ గ్రాము గోల్డ్ ఆభరణాలు, అలంకరణ సామాగ్రి, ట్రెండింగ్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ శుభకార్యాల కోసం కావలసిన అన్ని రకాల ఆకర్షణీయ వస్తువులు వినియోగదారులను అలరిస్తాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరోయిన్ అనన్య నాగళ్ల, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు దర్గా దయాకర్, బీఆర్‌ఎస్ నాయకులు మంద సంజీవరెడ్డి, గౌడ హాస్టల్ ప్రెసిడెంట్ మోతె చక్రవర్తి గౌడ్, నాగోల్ సుప్రజ హాస్పిటల్ ఎండి సిగా విజయకుమార్ గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, జీ బి ఎన్ ఫౌండర్, ప్రెసిడెంట్ చీకటి ప్రభాకర్ గౌడ్,పలువురు ప్రముఖులు,సంజయ్ జైన్, దర్గా దయాకర్ రెడ్డి, ఎమ్ నరేష్ గౌడ్ రాజకీయ నాయకులు, మోడల్స్, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను కలర్‌ఫుల్‌గా మార్చారు.

## ప్రజాసేవే లక్ష్యంగా ప్రజల మధ్య తిరుగుతూ, అవసరమైన వారికి అండగా నిలుస్తున్న సంద్రుగు శ్రీకాంత్,



**తెలంగాణ వీణ/ చేగుంట**

మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ ఇటీవల మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,బోయిని మురళి, కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన. సంద్రు గు శ్రీకాంత్,దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి,ఆదేశాల మేరకు సంద్రుగు శ్రీకాంత్, మురళి కుటుంబానికి,నగదు సహాయం తో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో రుక్మపూర్ గ్రామ అధ్యక్షుడు అంజా గౌడ్, మ్యాకల పరమేష్, అక్కానగారి సాయికుమార్ గౌడ్, నాగయ్య, మ్యాకల స్వామి,చాకలి రమేష్, ట్టపొరం బిక్షపతి,గజ్జల సాయికుమార్ ,దితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కార్యకర్తలు శ్రీకాంత్ సేవా భావాన్ని ప్రశంసించారు. పార్టీ కార్యకర్తల పట్ల చిత్తశుద్ధితో నిలిచే నాయకత్వం, పార్టీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు.

# తార్నాకలో తిరంగా యాత్ర



**తెలంగాణ వీణ/తార్నాక:**

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తిరంగా యాత్రకు మద్దతుగా శనివారం తార్నాకలో సిఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఐఖ్యతను చాటుతూ జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్పై యుద్ధం చేసి విజయం సాధించిన భారత సైన్యం సేవలను ఈ సందర్భంగా అభినందించారు. దేశ సైనికుల పోరాట పటిమను కీర్తించారు. దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో దేశ ప్రజలంతా ఐఖ్యతా సందేశాన్ని ఇవ్వాలనీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బొమ్మకంటి మల్లేషం, రాజమౌళి తదితరులున్నారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న తార్నాక బిఆర్ఎస్ నాయకులు.



**తెలంగాణ వీణ/ తార్నాక:**

సికింద్రాబాద్ నియోజక వర్గం సీతాఫల్మండిలో శనివారం కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్ల పంపిణి కార్యక్రమం జరిగింది. మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్తో కలిసి తార్నాక డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్రావు గౌడ్లు పాల్గొని లబ్దిదారులకు చెక్లను అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్దిదారులకు అందజేయడంతో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ముందుంటారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజక వర్గంలో పేద ప్రజలకు అండగా ఉన్న పద్మారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎల్లారెడ్డిపేట మండలం లో వరుస దొంగతనాలు

**తెలంగాణవీణ,ఎల్లారెడ్డిపేట...**

ఎల్లారెడ్డిపేట మండలం లో తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేయడం తో ప్రజలు భయబ్రతులకు లోనావుతున్నారు మొన్న 14/5/2025 రోజున రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పూసల కులానికి చెందిన మద్దివేణి శ్రీనివాసు ఇంట్లో దొంగతనం జరిగి LED TV బంగారం కొన్ని డబ్బులు దొంగతనం చేశారు అని శ్రీనివాసు తెలుపగ ఈ రోజు శనివారం రోజున రాచర్ల బొప్పాపూర్ గ్రామం లో ఇరవేణి శివకుమార్ ఇంట్లో సాయంత్రం గుర్తు తెలియని దొంగలు ఇంట్లో చొరబడి దొంగ తనాననికీ పాల్పడ్డారు ఇంట్లోని బీరువాని తెరిచి దొంగలించినట్టు సమాచారం దొంగతనం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి ధర్యాప్తు చేపట్టారు


# సందడిగా మూలం సంత





**తెలంగాణ వీణ/తార్నాక:**

గ్రామభారతి. సిఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తార్నాక మర్రి కృష్ణాహాల్లో నిర్వహించిన 11వ మూలం సంతకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 100 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ, గోఆధారిత, చేతివృత్తుల వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులతో మూలం సంతలో సందడి నెలకొంది. దీనికి జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ డీన్ డాక్టర్. పి. వి రావు, దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణులు బసంపల్లి నాగరాజు తదితరులు ముఖ్యాతిథులుగా హాజరై సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో సంరక్షణ, ప్రకృతి, పాడి, సాహిత్యం. కుల వృత్తులను, చేతి వృత్తులను ప్రోత్సహించడానికి గ్రామభారతి చేస్తున్న కృషిని అభినందించారు. నిర్వాహకులు కృష్ణారెడ్డి




మాట్లాడుతూ రానున్నరోజుల్లో ప్రకృతి, గ్రామీణ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఈ మూలం సంతను ఆన్లైన్ వేధికగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనీ డిమాండ్ చేస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన బాలకృష్ణను నిర్వాహకులు సన్మానించారు. ఈ సంతలో వివిధ రకాలైన మామిడి పండ్లు, దవా చాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సూర్యకళ, మల్లేషం, మోహన్, లింగం, బాలకృష్ణ తదితరులున్నారు.

## తిరంగా ర్యాలీలో ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి పోతన గోపాల్ గౌడ్.





**తెలంగాణ వీణ/నాచారం:**
ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు, ప్రశంసలు తెలుపుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మరియు మన ఐక్యత చాటడానికి ఈరోజు ట్యాంక్ బండ్ పై నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, హన్మంత్ బిరాదర్, రాజిరెడ్డి మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# ప్రజలు రాజిరెడ్డి సంతాప సభను నిర్వహించడం గర్వకారణం





**-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**తెలంగాణ వీణ/నాచారం:**
ప్రజలు స్వర్గీయ బండారి రాజిరెడ్డి సంతాప సభలను ప్రజల ముందుకువచ్చి నిర్వహించడం గర్వకారణంగా ఉందని ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కొనియాడారు. శనివారం నాచారం వి ఎస్ టి పార్క్ వద్ద రాజిరెడ్డి సంతాప సభను నిర్వహించారు. వి ఎస్ టి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఎస్ ఎస్ ఎస్ యువ సేన అధ్యక్షులు మామిడాల సంతోష్ రెడ్డి ఆద్వర్యంలో జరిగిన సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ నల్లా రాధాకృష్ణ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, గౌరవ అతిధిగా సాయిజెన్ శేఖర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహకులు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ వి ఎస్ టి కాలనీ పార్కును ప్లాట్లు చేసి ఇండ్లు కట్టాలని చూస్తే రాజిరెడ్డి కాపాడి పార్కును అభివృద్ధి చేసారని కొనియాడారు. అందుకు గాను ఈ పార్క్ కు బండారి రాజిరెడ్డి వి ఎస్ టి కాలనీ పార్క్ గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేసారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వి ఎస్ టి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం డివిజన్ జేఏసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలి

**కలెక్టర్ విజయేందిర బోయి**



**తెలంగాణ వీణ,మహబూబ్నగర్:**
మహబూబ్నగర్ జిల్లా లో పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి. ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. టి ఫ్రైడ్ ద్వారా ,షెడ్యూల్డ్ తెగల వారికి 4 మందికి ట్రాన్స్పోర్ట్ సెక్టార్ కింద వాహనాలకు,పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు కమిటీ లో ఆమోదం తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్, టి.జి. ఐ ఐ సి డి.డి.గణేష్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్ పార్టీలో అందలమెక్కి,కాంగ్రెస్ పార్టీనే విమర్శిస్తావా.

**-మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య.**



**తెలంగాణ వీణ,మహేశ్వరం...**
ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నతమైన పదవులను అనుభవించి రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పైన ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య అన్నారు. శనివారం మహేశ్వరం మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కన్వెన్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా పనిచేసిన స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చౌకబారు విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళిత ముఖ్యమంత్రి అని చెప్పి, దళితులకు మూడెకరాల భూమిని ఇస్తామని చెప్పి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పి, మాట ఇచ్చి తీరా అధికారం చేపట్టాక వాటన్నిటిని తుంగలో తొక్కిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది కాద అని ఆయన ప్రశ్నించారు. దళిత బంధు పేరుతో పార్టీ కార్యకర్తలకే దళిత బందును ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీ కే ఆ చరిత్ర దక్కుతుందని అని ఆయన అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కార్యక్రమంలో మంత్రిగా ఎమ్మెల్యేగా ఎంతో అపారమైన అనుభవం ఉన్న నీకు ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల వద్ద మీ ఇష్టం వచ్చినట్లు బ్యానర్లను కట్టి ఇతరులను కించపరచడం సరైన విధానమా అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్, 200 యూనిట్లు, ఉచిత విద్యుత్, రెండు లక్షల రైతు రుణమాఫీ, సన్న బియ్యం పథకం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ పేదలకు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గానికి పెద్దపీట వేస్తూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించడం మీకు ఇష్టం లేదా అని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మీరు ఇచ్చిన హామీలను ఎన్ని నెరవేర్చలేదో మీరు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆయన హితవు పలికారు. తులం బంగారం విషయంలో నియోజకవర్గంలో ఏ ఒక్క సమస్యలు లేనట్టు తులం బంగారాన్ని వేలెత్తి చూపుతూ మీ రాజకీయ డ్రామాలను ఆపాలని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నరసింహ, శివగంగ దేవాలయ చైర్మన్ అల్లె కుమార్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వత్తుల రఘుపతి, కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆవుల యాదయ్య, మంత్రి బాల్ రాజ్, ఇంద్రకంటి నరసింహ గౌడ్, చెపంగి ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బిక్షపతి, జావేద్, గొల్లూర్ రాజు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వనరుల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు.

**మండల విద్యాధికారి వి.కస్నానాయక్.**



**తెలంగాణ వీణ,మహేశ్వరం...**
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు శనివారం మహేశ్వరం మండల విద్యా వనరుల కేంద్రానికి చేరుకున్నాయని మండల విద్యాధికారి వి. కస్నా నాయక్ తెలిపారు. మొదటి విడతలో భాగంగా 26వేల 131 పాఠ్యపుస్తకాలు రావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 50 శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయని అన్నారు. జూన్ మొదటి వారంలో అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను చేరవేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# జూన్ 14 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**

**-జాతీయ లోక్ అదాలత్ పై పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం**





**తెలంగాణ వీణ,భద్రాద్రి కొత్తగూడెం...**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 14 వ తారీఖున జరగనున్న జాతీయ లోక్అదాలత్ ను విజయవంతం చేయాలని శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలు లో పోలీస్ అధికారులతో, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదుల తో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ అన్నారు. రాజీకాదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు మరియు ఇ -పిటి కేసుల వివరాలను ఠాణాల వారిగ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సారి జరిగే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసులను పరిష్కరించడం ద్వారా జిల్లాను ఉన్నత స్థానంలో తీసుకురావడం కోసం పోలీస్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాదితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతు లోక్ అదాలత్ లో రాజీపడటం వలన కక్షిదారులకు సమయము,డబ్బు వృధా కాజాలదని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు మరియు బ్యాంకు కేసులు, తెలిఫోన్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించుకొనుట కొరకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. సాయి శ్రీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెందు రాజమల్లు, పీపీ పీవీడీ లక్ష్మి, ఏ పీపీ లు, పోలీస్ అధికారులు, సీనియర్ న్యాయవాదులు ఎస్వి రామారావు, బాగం మాధవరావు, గాదే రామచంద్ర రెడ్డి, అంబటి రమేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.





# బిజినెస్

## భారత్‌కు వొడాఫోన్ గుడ్‌బై!

**ఏజీఆర్ బకాయిలపై ప్రభుత్వం సహాయం అందించకుంటే అంతే**

తెలంగాణవీణ, బిజినెస్

టెలికాం సేవల సంస్థ వొడాఫోన్ ఐడియా..భారత్‌కు గుడ్‌బై చెప్పేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఏజీఆర్‌పై ప్రభుత్వం సకాలంలో స్పందించకపోతే వచ్చే ఏడాది నుంచి టెలికం సేవలు అందించలేమని స్పష్టంచేసింది. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకోవడం కష్టతరమవుతున్నదని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏజీఆర్ బకాయిలపై స్పష్టతనివ్వాలని, లేకపోతే టెలికం సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ సీఈవో అక్షయ ముంద్రా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు.ప్రభుత్వ సపోర్ట్ లేకుండా టెలికాం సేవలు అందించలేమని, ముఖ్యంగా సర్దుబాటు స్థూల ఆదాయం(ఏజీఆర్) విధించిన రూ.30 వేల కోట్లను మాఫీ చేయాలని కేంద్రాన్ని కోరుతున్నది. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే వచ్చే ఏడాది నుంచి టెలికాం సేవలు అందించలేమని, ముఖ్యంగా బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి మొగ్గుచూపడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు. రూ.30 వేల కోట్ల ఏజీఆర్‌పై సుప్రీంకోర్టులో సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో విచారణ చేపట్టిన ప్రత్యేక బెంచ్ ఈ కేసు ఈ నెల 19న విచారణకు రానున్నది.

## యమహా బైక్ ప్రియులకు గుడ్ న్యూస్..

**నమ్మలేని వారెంటీ స్కీమ్ ప్రకటన**

తెలంగాణవీణ, బిజినెస్

యమహా మోటార్ తన ద్విచక్ర వాహనాలకు 10 సంవత్సరాల ఫుల్ వారంటీ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. పది సంవత్సరాల ఫుల్ వారంటీలో 2 సంవత్సరాల ప్రామాణిక వారంటీ, ఇంధన ఇంజెక్షన్ వ్యవస్థతో సహా ఇంజిన్, ఎలక్ట్రికల్ భాగాలను కవర్ చేసే అదనపు 8 సంవత్సరాల ఎక్స్‌టెండెడ్ వారంటీ ఉన్నాయి. యమహా బైక్‌లు స్కూటర్లు ఇప్పుడు 1,00,000 కి.మీ వరకు కవరేజ్ వారంటీని పొందుతాయి. అయితే భారతదేశంలో తయారు చేసిన బైక్స్‌కు అయితే 1,25,000 కి.మీ వరకు వారెంటీ కవర్ అవుతుందని ప్రకటించారు. అలాగే స్కూటర్లు 24,000 కి.మీ వరకు కవర్ అవుతాయి. ఎక్స్‌టెండెడ్ వారంటీ 76,000 కి.మీ వరకు ఉంటుంది. మోటార్ సైకిళ్లకు, ప్రామాణిక వారంటీ 30,000 కి.మీ వరకు ఉండగా, ఎక్స్‌టెండెడ్ వారంటీ 95,000 కి.మీ వరకు ఉంటుంది.యమహా హైబ్రిడ్ స్కూటర్ శ్రేణిలో రే జెడ్‌ఆర్ ఎఫ్ఐ, ఫాసినో 125 ఎఫ్ఐ ఉన్నాయి. ఈ



బ్రాండ్ ప్రస్తుతం ఒక మ్యాక్సీ స్కూటర్‌ను కూడా అందుబాటులో ఉంచింది. ఏరోక్స్ 155 పేరుతో ఈ స్కూటర్ కొనుగోలుకు అందుబాటులో ఉంది. భారతదేశంలో తయారు చేసిన మోటార్ సైకిల్ శ్రేణిలో ఎఫ్‌జెడ్ సిరీస్, ఆర్15, ఎంటీ-15 ఉన్నాయి. ఈ బ్రాండ్ ఎంటీ-03, వైజెడ్‌ఎఫ్-ఆర్3లను కూడా విక్రయిస్తుంది. 2025 యమహా ఏరోక్స్ 155 ఎస్ ఇప్పుడు రిఫ్రెష్ చేసిన రంగు ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. ఈ స్కూటర్ తాజా ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఓబీడీ2 అనుకూల ఇంజిన్‌తో ఆకట్టుకుంటుంది. ఈ కొత్త రంగుల్లో ఐస్ ఫ్లూ వెర్మిలియన్, రేసింగ్ బ్లూ వేరియంట్ ఉంటాయి.

ఈ స్కూటర్ ధర రూ.1,53,430గా ఉంది. ఈ స్కూటర్ ప్రస్తుత మెటాలిక్ బ్లాక్ వేరియంట్ రూ.1,50,130కు కొనుగోలు చేయవచ్చు. ఏరోక్స్ ఇప్పటికీ బ్లూ స్క్వేర్ డీలర్షిప్ ద్వారా కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. యమహా ఏరోక్స్ 155 లిక్విడ్-కూల్డ్, 4-స్ట్రోక్ ఎస్ఓహెచ్‌సీ 155 సీసీ ఇంజిన్‌తో ఆకట్టుకుంటుంది. అలాగే ఈ స్కూటర్ 8,000 ఆర్‌పీఎం వద్ద 14.8 బీహెచ్‌పీ గరిష్ట పవర్ అవుట్‌పుట్‌ను రిలీజ్ చేసింది. 6,500 ఆర్‌పీఎం వద్ద 13.9 ఎన్ఎం గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ స్కూటర్ సీవీటీ ట్రాన్స్ మిషన్‌తో ఇంజిన్ వేరియబుల్ వాల్వ్ యాక్చుయేషన్ (వీవీఏ)తో ఆకట్టుకుంటుంది. ఈ బైక్‌ను ఈ20 పెట్రోల్‌తో నడపాల్సి ఉంటుంది. స్టాండర్డ్ మోడల్ కంటే ఎస్-ట్రిమ్ కీలెస్ ఇగ్నిషన్ సిస్టమ్ వల్ల స్టార్టప్ ప్రక్రియను సులభంగా ఉంటుంది. కాబట్టి ఈ స్కూటర్ కీని గుర్తించడానికి ప్రాక్సిమిటీ డిటెక్షన్‌ను ఉపయోగిస్తుంది.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. ఎంతంటే..

తెలంగాణవీణ, బిజినెస్

సిడి ప్రియులకు ఊరటనిచ్చేలా గత కొంతకాలం నుంచి బంగారం ధరలు తగ్గుతూ వచ్చాయి. నెల క్రితం లక్ష రూపాయల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా 93 వేలకు పడిపోయింది. 22 క్యారెట్ల బంగారం 90 దిగువన ట్రేడ్ అవుతోంది. దీంతో శుభకార్యాలకు బంగారం కొనాలనుకున్న వారు షాపులకు ఎగబడ్డారు. మరికొంతమంది మాత్రం బంగారం ఇంకా కొంచెం తగ్గితే తీసుకుందామని అనుకున్నారు. అయితే, ఇప్పుడు బంగారం కొనాలనుకునే వారికి నిజంగా ఇది షాకింగ్ విషయమే.. బంగారం ధరలు పెరిగాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

**హైదరాబాద్‌లో బంగారం ధరలు ..**

గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం.. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల



బంగారం ధర 95130 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 87200 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 71350 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారంపై 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఈ రోజు 95140 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 87210 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 71360 దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు ఇలా..**

గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం.. హైదరాబాద్ నగరంలో వెండి ధరలు ప్రతీ నిత్యం తగ్గుతూ వెళు తున్నాయి. బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు స్థిరంగా తగ్గుతున్నాయి. నిన్న 100 గ్రాముల వెండి ధర 10800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,08000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములపై 10 రూపాయలు, కేజీపై 100 రూపాయలు తగ్గింది. ఈ రోజు 100 గ్రాముల వెండి ధర 10790 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,07,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## భారత్‌పై తొలి మ్యాచ్.. విండీస్ 'మిస్టర్ కూల్ కెప్టెన్' ఇతడే..!

తెలంగాణవీణ, క్రీడలు :

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌కోసం అన్ని జట్లు సన్నద్ధమవుతున్నాయి. జూన్‌లో మొదలుకాబోయే నూతన ఎడిషన్‌కు కొత్త సారథులను ప్రకటిస్తున్నాయి. తాజాగా వెస్టిండీస్ సెలెక్టర్లు రోస్టన్ ఛేజ్ ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. మార్చిలో క్రెగ్ బ్రాత్‌వైట్ రాజీనామా చేయడంతో ఆల్‌రౌండర్ అయిన రోస్టన్‌కు శనివారం పగ్గాలు అప్పగించింది విండీస్ బోర్డు. 33 ఏళ్ల రోస్టన్ రెండేళ్లుగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఆస్ట్రేలియా సిరీస్‌తో రోస్టన్‌కు తొలి సవాల్ ఎదురుకానుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఆసీస్‌కు కూడా ఇదే మొదటి సిరీస్.బ్రాత్‌వైట్ మార్చిలో టెస్టు సారథిగా తప్పుకున్నాడు. దాంతో, కొత్త కెప్టెన్ కోసం పలువురి పేర్లను పరిశీలించారు. జాన్ క్యాంప్‌బెల్, జొషువా డిసిల్వా, జస్టిన్ గ్రీవ్స్.. ఇలా పేర్లను పరిశీలించారు. ప్రస్తుతం వన్డే, టీ20లకు కెప్టెన్‌గా కొనసాగుతున్న షై హోప్ ను కూడా



సంప్రదించారట. కానీ, అతడు రెండు ఫార్మాట్లపై దృష్టి సారించేందుకే మొగ్గు చూపడంతో చివరకు రోస్టన్‌కు బాధ్యతలు అప్పగించారు. స్పిన్నర్, టెయిలెండర్ బ్యాటర్ అయిన జొమెల్ వారికన్ అతడికి డిప్యూటీగా ఎంపికయ్యాడు.'టెస్టు జట్టుకు కెప్టెన్ ఎంపిక చాలా క్లిష్టంగా జరిగింది. విండీస్ జట్టు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రోస్టన్‌ను ఎంపిక చేశాం. మా టీమ్ మొత్తం ఎంతో నిష్పక్షపాతంగా ఆలోచించి తుది నిర్ణయం తీసుకుంది. వెస్టిండీస్ క్రికెట్ గొప్ప నాయకులలో ఒకరిగా రోస్టన్ నిలిచిపోతాడని నమ్ముతున్నాం' అని వెస్టిండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో వెల్లడించాడు. ఇక హెడ్‌కోచ్ డారెన్ సమీ నూతన సారథి రోస్టన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తానని తెలిపాడు.


**బక్కపలచని మ్యాచ్ విన్నర్**

ఆరడుగుల పొడవుతో బక్కపలచగా ఉండే రోస్టన్‌ది బార్బడోస్‌లోని క్రిస్ట్ చర్చ్. దేశవాళీలో అదరగొట్టి సెలెక్టర్ల దృష్టిలో పడిన అతడు 2016లో జూలై21న భారత్‌పై అరంగేట్రం చేశాడు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఇప్పటివరకూ రోస్టన్ 49 టెస్టులు ఆడాడు. 26.33 సగటుతో 2,265 పరుగులు సాధించాడు. అందులో 5 సెంచరీలు ఉన్నాయి. ఆల్‌రౌండర్ అయిన అతడు 85 వికెట్లు పడగొట్టాడు. 2019లో ఇంగ్లండ్‌పై 60 పరుగులిచ్చి 8 వికెట్లు తీశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోస్టన్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

## వరుణుడిదే విజయం.. ప్లే ఆఫ్స్ రేసు మరింత రసవత్తరం..!

తెలంగాణవీణ, క్రీడలు :

ఐపీఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు మరింత రసవత్తరంగా మారింది. చిన్నస్వామిలో జరగాల్సిన ఆర్సీబీతో జరగాల్సిన మ్యాచ్ రద్దుతో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. వర్షం కారణంగా కనీసం 5 ఓవర్ల ఆట కూడా సాధ్యంకాకపోవడంతో.. రహానే బృందం నిరాశలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఆరుజట్లు మాత్రమే రేసులో ఉన్నాయి. రేపు జరుగబోయే డబుల్ హెడర్‌లో పంజాబ్ కింగ్స్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఒకవేళ ఓడిపోతే.. రజత్ పాటిదార్ బృందం నేరుగా ప్లే ఆఫ్స్ చేరుకుంటుంది.కోల్‌కతా నిష్క్రమణతో ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్, ఆర్సీబీ, ఢిల్లీ, పంజాబ్‌లతో పాటు ముంబై ఇండియన్స్ ), లక్నో సూపర్ జెయింట్స్ ) రేసులో ఉన్నాయి. రేపు రాజస్థాన్ రాయల్స్ గనుక పంజాబ్‌కు షాకిచ్చినా.. ఢిల్లీని గుజరాత్ ఓడించినా ఆర్సీబీ నేరుగా ప్లే ఆఫ్స్




చేరుతుంది. టాప్‌లో ఉన్న గుజరాత్ కూడా 18 పాయింట్లతో బెర్తు సాధిస్తుంది. అప్పుడు మిగిలిన రెండు స్థానాల కోసం ముంబై, లక్నో, ఢిల్లీ, పంజాబ్‌ల మధ్య గట్టి పోటీ నెలకొంటుంది.అప్పుడు మే 21న వాంఖడేలో ఢిల్లీతో జరుగబోయే మ్యాచ్ ముంబైకి కీలకం అవుతుంది. ఇప్పటికే 12 మ్యాచ్‌లు ఆడేసిన హార్దిక్ పాండ్యా సేన.. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే రేసులో ఉంటుంది. ఇక.. 10 పాయింట్లతో ఉన్న లక్నో మిగతా మూడు మ్యాచుల్లో గెలవాల్సి ఉంటుంది. ముంబై రెండు మ్యాచుల్లో ఓడిపోతే.. లక్నోకు కలిసి వస్తుంది. సో.. రేపటి డబుల్ హెడర్ ఫలితాలతో ప్లే ఆఫ్స్ రేసు మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది.

**ఆశలపై వరుణుడు నీళ్లు**

ప్లే ఆఫ్స్ చేరాలనుకున్న కోల్‌కతా ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. శనివారం చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరగాల్సిన మ్యాచ్ రద్దు అయింది. 1023 గంటలకు పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు, మ్యాచ్ రిఫరీ .. తడి ఔట్‌ఫీల్డ్ కారణంగా మ్యాచ్ నిర్వహణ అసాధ్యమని తేల్చి.. ఇరుజట్లకు చెరొక పాయింట్ కేటాయించారు. దాంతో, మరొక మ్యాచ్‌కు ముందే అజింక్యా రహానే బృందం ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. సొంత గడ్డపై గెలుపొంది ప్లే ఆఫ్స్ చేరాలనుకున్న ఆర్సీబీ మరొక మ్యాచ్ వరకూ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# స్పోర్ట్స్

## టీమిండియాకు కొత్త కోచ్.. ఇంగ్లండ్ పర్యటనతో రంగంలోకి..!



తెలంగాణవీణ, క్రీడలు :

ఇంగ్లండ్ పర్యటనను సవాల్‌గా తీసుకున్న సెలెక్టర్లు పటిష్టమైన స్క్వాడ్ ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే భారత ఏ జట్టు బృందాన్ని ప్రకటించిన బీసీసీఐ.. తాజాగా కొత్త కోచ్‌ను నియమించింది. మాజీ ఆల్‌రౌండర్ అయిన హృషికేశ్ కానిట్కర్ కు బాధ్యతలు అప్పగించింది. ఇంగ్లండ్ లయన్స్‌తో మూడు నాలుగురోజుల మ్యాచ్‌లకు హృషికేశ్ ఏ జట్టులోని ఆటగాళ్లకు సూచనలు ఇవ్వనున్నాడు. అతడితో పాటు ఫీల్డింగ్ కోచ్‌గా శుభోదీప్ ఘోష్ (అస్సాం), బౌలింగ్ కోచ్‌గా ట్రోనీ కూలేలు అభిమన్యు ఈశ్వరన్ బృందానికి సేవలందించనున్నారు.మహారాష్ట్రకు చెందిన హృషికేశ్ ఆల్‌రౌండర్‌గా 1999లో ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేశాడు. అదే ఏడాది వన్డేల్లోనూ అడుగు పెట్టిన అతడు శ్రీలంకపై మొదటి మ్యాచ్ ఆడాడు. అయితే.. అంతర్జాతీయంగా హృషికేశ్ కెరీర్ ఏడాదికే పరిమితమైంది. 2000 జనవరిలో ఆస్ట్రేలియాపై అతడు చివరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత కోచ్ అవతారం ఎత్తిన అతడు.. మహిళల జట్టును తీర్చిదిద్దాడు.హృషికేశ్ ఆధ్వర్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించింది. అదే ఏడాది ఇండియా ఏ, అండర్ -19 జట్లుకూ హృషికేశ్ కోచింగ్ ఇచ్చాడు. సో.. అతడి అనుభవం ఇంగ్లండ్ పర్యటనలో భారత ఏ జట్టుకు పనికొస్తుందని బీసీసీఐ భావిస్తోంది.



# మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ ?

**తెలంగాణవీణ, సినిమా :**
వాల్మీకి రామాయణంలో సీత పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉందో.. రావణాసురుడి అర్ధాంగి మండోదరి పాత్రకు కూడా అంతటి ప్రాధాన్యత ఉంది. సీతకు ఏమాత్రం తీసిపోని మహాపతివ్రత మండోదరి. జమున, బి.సరోజాదేవి, కృష్ణకుమారి వంటి మేటి నటీమణులు ప్రాణప్రతిష్ట చేసిన పాత్ర అది. అలాంటి గొప్ప పాత్ర కాజల్ అగర్వాల్‌ని వరించిందనేది ఇప్పుడు బాలీవుడ్ మీడియాలో లేటెస్ట్ న్యూస్.రణ్‌బీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా పౌరాణిక చిత్రం 'రామాయణ'లో యష్ రావణుడిగా నటిస్తుండగా, మండోదరిగా కాజల్ అగర్వాల్ ఖరారయ్యారట. ఇప్పటికే టీమ్ ఆమెను సంప్రదించిందనీ, కాజల్ కూడా మండోదరిగా కనిపించేందుకు సుముఖత వ్యక్తం చేశారనేది బాలీవుడ్ సమాచారం. గతవారం లుక్ టెస్ట్ కూడా జరిగిందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ ప్రచురించింది. ఇదే నిజమైతే.. కాజల్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే పాత్ర ఇదే అవుతుంది. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 2026 దీపావళికి తొలి భాగాన్ని, 2027 దీపావళికి మలిభాగాన్నీ విడుదల చేస్తామని నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రా ఇటీవలే ప్రకటించారు.




# హిలేరియస్‌గా 'భకాసుర రెస్టారెంట్' ట్రైలర్

**తెలంగాణవీణ, సినిమా :**
ప్రముఖ కమెడియన్‌లు ప్రవీణ్ వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'భకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. విపరీతంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. హారర్ కామెడీ జానర్‌లో వస్తున్న ఈ ట్రైలర్ చూస్తుంటే సినిమా హిలేరియస్‌గా ఉండబోతుందని తెలుస్తుంది.షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య, ప్రాచీ ఠాకూర్, జబర్ధస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీఓపీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తండ్.కె.వెంకటేష్, సంగీతం: వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ రాజా సీఆర్ తంగాల, పీఆర్ఓ: ఏలూరు శ్రీను, మదూరి మధు, నిర్మాతలు: లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి, దర్శకత్వం: ఎస్‌జే శివ




# కమల్ హాసన్ 'థగ్ లైఫ్' ట్రైలర్ విడుదల

**తెలంగాణవీణ, సినిమా :**
తమిళ విలక్షణ నటుడు కమల్ హాసన్ నటిస్తున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ మరియు రెడ్ జెయింట్ మూవీస్ బ్యానర్‌లపై ఈ చిత్రం రూపొందుతుండగా.. ఈ చిత్రానికి లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వం వహిస్తున్నారు. సిలంబరసన్ టి.ఆర్., త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్య లక్ష్మి, జోజు జార్జ్, అభిరామి మరియు నాజర్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా జూన్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.ఈ ట్రైలర్ చూస్తుంటే గ్యాంగ్‌స్టర్ డ్రామా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. నాయకుడు తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.


# చిరు - అనిల్ రావిపూడి సినిమాలో హీరోయిన్‌గా నయనతార

**తెలంగాణవీణ, సినిమా :**
టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవి కొత్త సినిమాను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడితో తన కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాడు. మెగా 157 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. గత ఉగాది పండుగ రోజున పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. చిరంజీవి ఈ చిత్రంలో తన నిజమైన పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో కనిపించనున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి తాజాగా ఒక అప్‌డేట్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కథానాయికగా తమిళ లేడి సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించబోతుంది. తాజాగా ఇందుకు సంబంధించిన వీడియోను పంచుకుంది చిత్రబృందం. హలో మాస్టర్ కెమెరా కొంచెం రైట్ టర్న్ ఇచ్చుకొండి. సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం అంటూ వీడియోను విడుదల చేసింది.ఈ సినిమా షూటింగ్‌ను మే 22 నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ చిత్రం పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త సినిమా సెట్స్‌పైకి వెళ్లనున్నారు. అలాగే అనిల్ రావిపూడి ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ హాఫ్ స్క్రిప్ట్‌ను వైజాగ్‌లో రాస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి ద్విపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో చిరంజీవి నయనతారతో పాటు, క్యాథరీన్ థెరిసా నటించనున్నారని సమాచారం. అలాగే, సీనియర్ నటుడు వెంకటేష్ ఈ సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం 2026 సంక్రాంతికి విడుదల కానుంది.



# హరి హర వీరమల్లు' గ్రాండ్ ప్రెస్ మీట్ ఎప్పుడంటే.!

**తెలంగాణవీణ, సినిమా :**
ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రాలలో హరిహర వీరమల్లు ఒకటి. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకు రూల్స్ రంజన్ దర్శకుడు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీని జూన్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీకి సంబంధించి మే 21న గ్రాండ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రెస్ మీట్‌లో సినిమాకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం.




Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written